జగనన్న ఆధ్వర్యంలోనే నగరాభివృద్ధి

- వైఎస్సార్ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్
- 38వ డివిజన్‌లో పర్యటన


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే విజయవాడ అభివృద్ధి సాధ్యమైందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. 38వ డివిజన్ కార్పొరేటర్ రెహమతున్నీసా ఆధ్వర్యంలో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా 38వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీతో కలిసి గడప గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై స్పందించి అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. వాటితో పాటుగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సూచనలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విజయవాడ నగరాన్ని అందులోనూ పశ్చిమ నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విజయవాడ నగరంలో అన్ని రహదారులు అభివృద్ధి చేశామని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి వీధి సీసీ రోడ్లుగా మార్పు చెందటం అందరికీ తెలుసన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు వలన ప్రజలకు మంచి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు వందలాది కోట్ల రూపాయాల వ్యయం చేసిందన్నారు. కొండ ప్రాంతాల అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం చిత్తశుద్ధిగా పని చేసిందని వివరించారు. చంద్రబాబు రానున్న ఎన్నికల్లో అనేక బూటకపు వాగ్దానాలు చేసి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అన్నారు. అటువంటి దగాకోరు టీడీపీ కూటమిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. నగరాభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాలు విజయవాడను పూర్తిగా విస్మరిస్తే తమ ప్రభుత్వం అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహించిందన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి...

డివిజన్‌లోని 119, 159 సచివాలయం సిబ్బందితో ఆసిఫ్ కలుసుకొని వారితో ముచ్చటించారు. ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు తోడ్పడాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వం అందిస్తున్న మంచిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పడిగిపాటి చైతన్యరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, నాయకులు మైలవరపు దుర్గారావు, గోదావరి బాబు, షేక్ హయత్, అండమాను బాబ్జి, మంటి కోటేశ్వరావు, శాంతి, నీలవేణి, ఎద్దు సురేష్ , బొమ్ము మధు, షేక్. అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌ను గెలిపించుకుంటాం

ఏపీ ఫకీర్ ముస్లిం కమిటీ


ఆసిఫ్‌ను సత్కరిస్తున్న ఏపీ ఫకీర్ ముస్లిం కమిటీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఫకీర్ ముస్లిం కమిటీ షేక్ ఇమామ్‌వలీ ప్రకటించారు. కమిటీ కార్యవర్గం ఆసిఫ్‌ను వించిపేటలోని ఆయన కార్యాలయంలో కలిసి మద్దతు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం సామాజికవర్గంలో భాగమైన ఫకీర్లుగా ఉన్న తామంతా ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉందన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పిస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఫకీర్ల సంఘంను కృతజ్ఞతలు తెలిపి వారికి అండగా ఉంటానన్నారు.

కార్యక్రమంలో గొల్లపూడి ఎంపీటీసీ సైదాబీ, సంఘ అధ్యక్షులు షేక్ ఇమామ్ వలీ కమిటీ ప్రముఖులు సయ్యద్ సల్మాన్, షేక్ కాలేషా , షేక్ మౌలాలి, ఎస్‌డి సుభాని, షేక్ భాష, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన నాట్య తరంగిణి డాన్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందచేశారు.

మాక్ టెస్ట్‌లతో పరీక్షలపై అవగాహన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాక్ టెస్టులతో గ్రూప్–2 పరీక్షలపై అవగాహన వస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. విజన్ ఫౌండేషన్, విద్యాదర్శిని ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్ష మాక్ టెస్ట్ వివరాలతో ముద్రించిన పోస్టర్‌ను సోమవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత మాక్ టెస్టులు ఈ నెల 11 వ తేదీ నుంచి 23 వరకు జరుగుతాయన్నారు. బెంజ్ సర్కిల్ సమీపంలోని విద్యాదర్శిని ఐఏఎస్ అకాడమీ ఆవరణలో 11 తేదీ ఉదయం 9 గంటలకు మొదటి మాక్ టెస్ట్ ప్రారంభమవుతుందని చెప్పారు. రెండు రోజులకు ఒక మాక్ టెస్ట్ చొప్పున ఫిబ్రవరి 23 వరకు మొత్తం 5 మాక్ టెస్టులు ఉంటాయని తెలిపారు. హాజరు కావాలనుకునే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా 93902 27500 కి కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెస్‌లో మెడిసిన్ విద్యార్థిని సాయి దివ్య ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

పటమట(విజయవాడతూర్పు): వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1–3వ తేదీ వరకు నిర్వహించిన విజ్ఞాన్ నేషనల్ లెవల్ మహోత్సవ్‌లో సిద్దార్థ మెడికల్ కళాశాల విద్యార్థిని మేకల సాయిదివ్య స్త్రీల చెస్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిందని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి సాయిదివ్యకు ప్రథమ బహుమతితోపాటు రూ.6 వేల నగదు రివార్డును యూనివర్శిటీ చైర్మన్ లావు రత్తయ్య అందించారని తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో ఆమెకు అభినందన సభ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్, డాక్టర్ ఆర్ నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రాము జరుబుల, ఇతర వైద్య సిబ్బంది, విద్యార్థులు ఆమెను అభినందించారన్నారు.

ప్రధానార్చకుడిగా గోపిబాబు నియామకం


గోపిబాబుకు నియామకపత్రం ఇస్తున్న ఈవో రమేష్‌నాయుడు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయ ప్రధానార్చకుడిగా మర్రిబోయిన గోపిబాబు నియమితులయ్యారు.

ఈ మేరకు ఈవో కె.రమేష్‌నాయుడు తన కార్యాలయంలో సోమవారం గోపిబాబుకు నియామక పత్రం అందజేశారు. గతంలో పనిచేసిన ప్రధానార్చకుడు మర్రిబోయిన వెంకటరమణ మృతిచెందడంతో అతని స్థానంలో ఆలయంలోని ఉప ప్రధానార్చకుల్లో సీనియరైన గోపిబాబును నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఉమాపతి, సూపరిండెంటెంట్ ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగర సమీపంలోని అబ్దుల్ షా ఖాదరి దర్గా (పాముల కాలువ సెంటర్)కు సీసీ కెమెరాల నిమిత్తం ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ తనుబుద్ది చంద్రశేఖరరెడ్డి రూ.16 వేల ఆర్థిక సాయం అందించారు. నగదును ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ చేతుల మీదుగా దర్గా అధ్యక్షులు కరీంఖాన్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ చంద్రశేఖరరెడ్డిని అభినందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొంటున్నారని అభినందించారు. కార్పొరేటర్ అప్పాజీరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



గుణదల(విజయవాడతూర్పు): కుల మతాలకు అతీతంగా భక్తులు మరియమాతను దర్శించుకుని దీవెనలు పొందుతున్నారని ప్రావెన్షియల్ ఫాదర్ బవిరి సురేష్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఆరో రోజుకు చేరుకున్నాయి. సోమవారం జరిగిన నవదిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ సురేష్ మాట్లాడుతూ.. గుణదల పుణ్య క్షేత్రం ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రమన్నారు. గుణదల మేరీమాతను పూజిస్తే సకల ఆశీర్వాదాలు లభిస్తాయని తెలిపారు. ఈ ఏడాది జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలు భక్తుల్లో విశ్వాసాన్ని నింపగలవని అభిప్రాయపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు మరియతల్లిని దర్శించుకుని ఆమె దీవెనలు పొందాలని కాంక్షించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పుణ్యక్షేత్ర గురువులు దేవుని నిబంధనా మందసాన్ని ప్రదర్శనగా కొండపైకి తీసుకువెళ్లారు. పలు విచారణల నుంచి వచ్చిన కన్యలు, భక్తులు దేవుని గీతాలు ఆలాపిస్తూ ముందుకు సాగారు. కొండపైన మరియమాత స్వరూపం వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ సునీల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వన్‌వేలో మితిమీరిన వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టిన ఘటనలో మహిళకు తీవ్రగాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్టినగర్‌కు చెందిన షేక్ హుస్సేన్‌బీ పాత బస్టాండ్ సమీపంలోని ఓ బార్‌లో పని చేస్తుంది. ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, రాయల్ హోటల్ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. దీంతో హుస్సేన్‌బీ రెండు చేతులకు, తల నుదుటి భాగంపై బలమైన గాయం కావడంతో బాధితురాలిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వేర్వేరు కేసుల్లో 16 మంది అరెస్ట్

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై ఆదివారం రాత్రి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. కొండపల్లి పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహిస్తున్న పేకాట శిబిరంలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,270 నగదు స్వాధీనం చేసుకున్నారు. అడవి క్వారీలో మరో పేకాట శిబిరం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పైదూరుపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మట్టకొయ్య వెంకటేశ్వరరావును అరెస్ట్‌చేసి అతిని వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకన్నారు. ఎస్‌ఐ పాపారావు పర్యవేక్షణలో కేసునమోదు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా నకరికల్లు గ్రామానికి చెందిన రేలంగి ఊర్మిల వారి కుమార్తె విజయలక్ష్మి పేరు మీద రూ.10,116 విరాళంగా అందజేశారు. ఆలయ పాలకమండలి డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా విరాళం అందించారు.

కృష్ణవేణి క్లాత్ మార్కెట్‌లో నేత్ర శిబిరం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల పట్ల అప్రమత్తత అవసరమని అయాన్ ఐ హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ అన్నారు. వన్‌టౌన్‌లోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ఆవరణలో అయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వావిలాల రజనీకాంతశర్మ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రాల పట్ల కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అంధత్వంతో కోట్లాది మంది ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఆహారపు అలవాట్లు, నేత్రల పట్ల జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా చక్కని చూపును పొందవచ్చన్నారు. శిబిరంలో డాక్టర్ మణికుమార్ సేవలందించారు. కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై దంత వైద్య కళాశాలలో అవగాహన

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. హెచ్‌సీజీ కేన్సర్ కేంద్రం ప్రముఖ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రియదర్శిని హాజరై క్యాన్సర్‌పై అవగాహన నిర్వహించారు. నోటి కేన్సర్‌కు కారకాలు, లక్షణాలు, నిర్ధారణ, చికిత్స విధానాలు, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ స్వీయ పరీక్ష విధానాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో కేన్సర్ నిర్మూలకు దంత వైద్యులు, విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్ రమేష్, డాక్టర్ లహరి, డాక్టర్ అమరనాథ్, డాక్టర్ సుకాంతి, డాక్టర్ నీమా, డాక్టర్ విశ్వచైతన్య, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జి.కొండూరు: అప్పులబాధ భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే..జి.కొండూరు మండల పరిధి దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన బొల్లినీడు తిరుపతిరావు (34)కు వివాహమై భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా తిరుపతిరావు వృత్తిరీత్యా గొర్రెలను క్రయ విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో అధికంగా అప్పులు చేసిన తిరుపతిరావు తిరిగి చెల్లించలేక ఆదివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తిరుపతిరావును విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 11గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

మరుపిళ్ల చిట్టి సేవలు మరువలేనివి

మేయర్ భాగ్యలక్ష్మి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బడుగు, బలహీన వర్గాలతో పాటు నగరాభివృద్ధి కోసం ప్రప్రథమంగా పాటు పడిన మరుపిళ్ళ చిట్టి విగ్రహావిష్కరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. 46వ డివిజన్ పరిధిలోని మేయర్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ భాగ్యలక్ష్మి, మరుపిళ్ళ చిట్టి విగ్రహావిష్కరణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మద్యపాన నిషేధం కోసం చేసిన పోరాటాలు, కొండ ప్రాంతాల అభివృద్ధికి, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా మరుపిళ్ళ చిట్టి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆనాడు పాలప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం 25 ఎకరాల స్థలాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. చిట్టి భార్య భ్రమరాంబ భర్త అడుగుజాడల్లో నడవడంతో ఆమె పేరిట నగరంలోని కృష్ణలంక ప్రాంతానికి అమె పేరున భ్రమరాంబపురంగా పెట్టడం జరిగిందన్నారు. దుర్గగుడి మొట్టమొదటి చైర్మన్ కూడా ఆమేననే విషయం గుర్తు చేసుకోవాలన్నారు. చిట్టి సేవలను గౌరవించి చిట్టినగర్ సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారం ఎంతో గొప్పదన్నారు. కొంత మంది చిల్లర నాయకులు చరిత్ర గురించి తెలుసుకోకుండా గొప్ప వ్యక్తుల గురించి చులకనగా మాట్లాడుతున్నారని తెలిపారు. 2019లో పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి వల్లే నగరాలకు గుర్తింపు వచ్చిందని చెప్పుకుంటున్నారన్నారు. ఎన్నో ఏళ్లగా ఉన్న మరుపిళ్ళ చిట్టి కార్యాలయాన్ని కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ కట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నారని ప్రచారం చేశారని, చిట్టి కార్యాలయాన్ని ఆయన స్మారక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే విషయాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. సమావేశంలో విగ్రహావిష్కరణ కమిటీ ప్రతినిధులు బాబూజీ, రాజగిరి సోమేశ్వరరావు, మజ్జి శ్రీనివాస్ తదితరులున్నారు.

అన్ని వర్గాలు అండగా ఉండాలి

వైఎస్సార్ సీపీకి డ్రైఫిష్ అసోసియేషన్ మద్దతు


మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయటానికి అన్ని వర్గాలు అండగా ఉండాలని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో పాతబస్తీలోని విజయవాడ డ్రై ఫిష్ అసోసియేషన్ వారితో ఆత్మీయ సమావేశాన్ని సోమవారం సాయంత్రం హనుమంతరాయ ఫిష్ మార్కెట్ సముదాయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ప్రధానంగా అట్టడుగు వర్గాలకు అండగా ఉంటుందన్నారు. మార్కెట్ అభివృద్ధికి, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తాను అండగా ఉంటానని వివరించారు. వ్యాపారులు ఆసిఫ్‌కు మద్దతు ప్రకటించి సత్కారం చేశారు. రానున్న ఎన్నికల్లో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యలకల చలపతిరావు, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ గఫార్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు షేక్ అనీఫ్, కోశాధికారి ఎస్‌కే సలీమ్, సభ్యులు అజీజ్ షకూర్, మొహిద్దీన్, ఉమర్‌ఖాన్, రహీమ్‌ఖాన్, ఎస్‌కే నజీర్, మూస తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన


అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కారం అందించేందుకు స్పందన నిర్వహిస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయలంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారుల సమక్షంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. స్పందనలో మొత్తం 13 ఫిర్యాదులు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై -3, ప్రజారోగ్యంపై-1, పట్టణ ప్రణాళిక-6, రెవెన్యూ-3 ఫిర్యాదులను స్వీకరించారు. చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకరరావు, పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్ జీఎస్‌జీవీఎస్ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అఫ్ హెల్త్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) సృజన, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి రోహిణి, ఎకౌంటు ఆఫీసర్ నరసింహమూర్తి, ఉద్యానవన విభాగం అధికారి రత్నకొండ రామ్మోహన్, బయాలజిస్ట్ సూర్య నాయక్, రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి


శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం సమావేశ మందిరంలో సోమవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. డివిజన్లలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తన నుంచి ఎలాంటి సహాయం, సౌకర్యాలు కావాలన్నా కల్పిస్తామని చెప్పారు. అవసరమైతే సిల్ట్ తీయడానికి డివిజన్‌కు రెండు ట్రాక్టర్లు, పుష్ కార్టులు, కార్మికులను పెంచుతామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఇన్‌స్పెక్టర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ రత్నావళి, ఏఎంవోహెచ్‌లు బాబు శ్రీనివాసన్, సురేష్, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

11న బీఎన్‌ఐ ఏపీ లార్జెస్ట్ కాన్వకేషన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 11న విజయవాడ నగరంలోని ఎస్‌ఎస్ కన్వెన్షన్ హాలులో తమ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ లార్జెస్ట్ నెట్వర్కింగ్ కాన్వకేషన్–2.0ను నిర్వహిస్తున్నట్లు బిజినెస్ నెట్ వర్కింగ్ ఇండియా (బీఎన్‌ఐ) విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ చెప్పారు. నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. జై దేశాయ్ మాట్లాడుతూ పరస్పర సహకారంతో వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. నెట్ వర్కింగ్‌ను విస్తృతం చేయడం ద్వారా అద్భుతమైన ఫలితాలను ఆవిష్కరించవచ్చునని చెప్పారు. వ్యాపారంలో వివిధ రంగాలకు చెందిన వారిని ఒక్క చోటుకి చేర్చి వారి మధ్య సంబంధాలను నెలకొల్పడం ద్వారా విస్తృత వ్యాపార అవకాశాలను సృష్టించేందుకు ఈ కాన్వకేషన్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ సదస్సుకు వాణిజ్యవేత్తలు, వైద్య నిపుణులు, ప్రతిష్ఠాత్మక సంస్థల్లోని ఉన్నత స్థాయి ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. బీఎన్‌ఐ సభ్యులతో సహా మొత్తం 1500 మంది ప్రతినిధులను ఈ సదస్సుకు ఆహ్వానించినట్లు తెలిపారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఐపీఎస్ అధికారి డాక్టర్ కిరణ్ బేడీ అతిథిగా హాజరవుతారనరి వెల్లడించారు. కాన్వకేషన్ ట్రెజరర్ త్రినాథ్ నందూరి మాట్లాడుతూ ఈ సదస్సులో ఏపీ చాంబర్, విజయవాడ చాంబర్, డెంటల్, ఇంటీరియర్స్, ఆర్కిటెక్చర్, రోటరీ, సీఏ, బిల్డర్, ఇంజనీర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశంలో బీఎన్‌ఐ కాన్వకేషన్ చైర్మన్ మద్దినేని శ్రీనివాస్, కన్వీనర్ మేఘన ఆచంట పాల్గొన్నారు.

వార్డు వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఫిబ్రవరి నాటికి 18–35 ఏళ్లమధ్య వయస్సులోపు ఉండాలని తెలిపారు. నగర పరిధిలో మాత్రమే నివసించే వారు అర్హులని, ఆసక్తికలిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) లేదా వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్ 8085933187 నంబర్లో సంప్రదించాలన్నారు.

180 బాటిళ్ల మద్యం పట్టివేత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా నిల్వ చేసిన 180 మద్యం బాటిల్స్‌ను కొత్తపేట పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. కేఎల్‌రావునగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్‌ఐ ప్రసన్న రైల్వే ఆప్ యార్డు వద్ద నిఘా పెట్టారు. కేఎల్‌రావునగర్‌కు చెందిన యసలపూడి హరికిషోర్ మద్యం నిల్వ చేసినట్లు తేలింది. దీంతో హరికిషోర్ ఇంటిపై దాడి చేయగా 180 క్వార్టర్ బాటిల్స్ మద్యం గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.